క్లుప్తంగా

అన్నదానంలో పాల్గొన్న ఏపీ టిడ్కో చైర్మన్



అన్నదానంలో పాల్గొన్న ఏపీ టిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

పార్వతీపురంటౌన్: పురపాలక సంఘం పరిధిలోని ఆరోవార్డులో నిర్వహిస్తున్న వరసిద్ధి వినాయక ఉత్సవాల్లో భాగంగా గురువారం ఏపీటిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో 2వేలమంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మజ్జి పారినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గౌరీశంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంజీవనాయుడికి సన్మానం



సంజీవనాయుడిని సన్మానిస్తున్న ఎంపీపీ, గ్రామపెద్దలు

బలిజిపేట: సేవాభావంతో అందరికి సేవలు అందించేవారికి సమాజంలో మంచి విలువ, గౌరవం ఉంటుందని ఎంపీపీ జి.నాగమణి అన్నారు. మండలకేంద్రంలోని కాపువీధిలో వినాయక మహోత్సవం సందర్భంగా సంజీవ నాయుడిని ఎంపీపీ ఆధ్వర్యంలో గ్రామపెద్దలు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ గ్రామంలో ఎంతోమంది నిరుపేదలకు ఆర్థిక సహకారం అందించేందుకు విరాళాలు సేకరించడం, ఉచిత నేత్ర వైద్యశిబిరాలు నిర్వహించడం, పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం సేవలు అందించడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంజీవనాయుడు అందరికీ ఆప్తుడయ్యాడని ప్రశంసించారు. కార్యక్రమంలో జగన్, సీహెచ్.సత్యంనాయుడు, ఎం.బలరాం, అప్పలరామమూర్తి, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ఆలయ ప్రధానఅర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు భక్తులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం లక్ష్మీనృసింహ స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో మహిళలు స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు.ముందుగా ఆలయప్రధాన అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారిని వివిధ రకాల పూలు,పత్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజల అనంతరం దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదాల వితరణ జరిగింది.

గిరిశిఖర గ్రామాల్లో ఖరీఫ్ పనులు ప్రారంభం..



నందలో దమ్ము చేస్తున్న గిరిజన రైతు

మక్కువ: గిరిశిఖర గ్రామాలలో పోడు వ్యవసాయం పనులు ప్రారంభమయ్యాయి. మైదాన ప్రాంతంలో ఇప్పటికే నాట్లు పూర్తవ్వగా.. గిరిశిఖర గ్రామాల్లో దమ్ములు చేపడుతున్నారు. మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనుల్లో గిరిజన రైతులు బిజీగా ఉన్నారు. నంద గ్రామ సమీపంలో ఓ గిరిజన రైతు నాట్లు వేసేందుకు దమ్ము చేపడుతూ సాక్షి కంటపడ్డాడు.

బాధ్యతల స్వీకరణ



మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన జయరాం

సాలూరు: మున్సిపల్ కమిషనర్‌గా జయరాం గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన హనుమంతు శంకరరావు ఏసీబీ దాడుల్లో పట్టుబడడంతో నూతన మున్సిపల్ కమిషనర్‌గా జయరాం నియమితులయ్యారు. కమిషనర్‌ను పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అవగాహనతోనే పాడి పశువుల రక్షణ

- వర్షాకాలంలో పొంచిఉన్న వ్యాధుల భయం
- ఉచితంగా వ్యాధినిర్ధారణ, అందిస్తున్న మందులు
- విస్తృతంగా వ్యాక్సినేషన్



పాడి పశువులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

పార్వతీపురం టౌన్:

ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొత్తనీరు సంబంధిత నీటి వనరుల్లో చేరుతోంది. నిద్రావస్థలో ఉన్న వైరస్ వర్షాకాలంలో మనుషులతో పాటు పశువులపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రస్తుత సీజన్‌లో వర్షాల కారణంగా పశువుల్లో అనేక వ్యాధులు ప్రబలే అవకాశం అధికమని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ఏజెన్సీ కలబోసి ఉన్న పార్వతీపురం నియోజకవర్గంలో ఆవులు గేదెలు, గొర్రెలు, మేకలు మొత్తం 69,568 ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. జీవాలోల్ వచ్చే జబ్బవాపు వ్యాధి, గొర్రెల్లో వచ్చే చిటుక వ్యాధులకు, సీజనల్‌గా విజృంభించే గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్ల ప్రక్రియ పశుసంవర్ధక శాఖ నేతృత్వంలో చేపడుతున్నారు. 3 మండలాల పరిధిలో ఆవులు, గేదెలు, ఎద్దులకు సుమారు 40వేల వ్యాధి నిరోధక టీకాలు అందించారు. ఈ నేపథ్యంలో పశువులకు సంక్రమించే వ్యాధులు, వాటి నివారణ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని, సర్కారు అందిస్తున్న ఉచిత సేవలు, వ్యాక్సిన్లు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా జీవాల్లో వచ్చే రోగాలపై అవగాహన పెంచుకోవాలని సూచిస్తున్నారు.

చిటుకు వ్యాధి..

గొర్రెలకు చిటుకు వ్యాధి ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధి వస్తే జీవాలు తూలుతూ నడుస్తాయి. ఇది బ్యాక్టీరియా వల్ల వ్యాపిస్తుంది. ఉన్నట్లుండి గాలిలో ఎగిరి చిటికలో చనిపోతాయి. కాబట్టి దీనికి ఆ పేరు వచ్చింది. మందలో 10 పైగా జీవాలు చనిపోతే చిటుకు వ్యాధి సోకినట్లు భావించవచ్చు. మందలో నీరసంగా ఉన్న గొర్రెలను మందల నుంచి వేరు చేయాలి. వ్యాధి నివారణకు పెన్సిలిన్ వేయించాలి. వ్యాధి సోకని గొర్రెలకు వ్యాక్సిన్ వేయించాలి.

జాగ్రత్తలు తప్పనిసరి



వర్షాకాలంలో పశువుల పట్ల జాగ్రత్తలు తప్పనిసరి. ముఖ్యంగా అవసరం మేర దాణాలు అందుబాటులో ఉంచుకోవాలి. తడిచిన దాణా పెట్టకూడదు. పశువుల షెడ్లను పరిశుభ్రంగా ఉంచాలి. ఎండుగడ్డి తడవకుండా చూడాలి. మేతలను అధికంగా పెట్టకూడదు. గుంపుగా అన్నింటినీ ఒకే చోట కట్టరాదు. వరదల కారణంగా గాయపడిన జీవాలకు తక్షణ వైద్యసేవలు అందించాలి.

– డాక్టర్ భోగి చక్రధర్, పశువైద్యాధికారి, పార్వతీపురం

నీలినాలుక వ్యాధి..

నీలినాలుక వ్యాధి, గొర్రెలు, మేకల్లో వస్తుంది. వైరస్ వల్ల ఇవి వ్యాప్తి చెందుతాయి. ఈ వ్యాధి సోకిన జీవాల్లో జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నోటి నుంచి చొంగ కారుతుంది. గిట్టలకు పుండ్లు ఏర్పడతాయి. ఆహారం తీసుకోకుండా, బలహీనంగా ఉంటాయి. ఈ వ్యాధి సోకిన జీవాలు మందనుంచి దూరంగా గుంపుగా ఉంటాయి. ఈ వ్యాధి నివారణకు యాంటీ బయాటిక్స్, లివర్ టానిక్ ఉపయోగించాలి. వ్యాధి సోకిన జీవాలను వేరుచేసి, మిగిలిన వాటికి టీకాలు అందించాలి.

గొంతువాపు వ్యాధి..

గొంతువాపు వ్యాధి బ్యాక్టీరియా వల్ల వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి అన్ని వయస్సుల గేదెలు, ఆవుల్లో కనిపిస్తుంది. వ్యాధి లక్షణాల విషయానికి వస్తే 105 నుంచి 106 డిగ్రీల జ్వరం కనిపిస్తుంది. నోటి నుంచి చొంగ కారుతుంది. అదేవిధంగా నోటితో ఎక్కువగా గాలి పీల్చుకుంటాయి. మేత తీసుకోలేకుండా, గొంత వద్ద వాపు కనిపిస్తుంది. నివారణకు సల్ఫాడిమిడిన్ మందును ఉపయోగించాలి. నాలుగు నెలలు దాటిన జీవాలకు కచ్చితంగా వ్యాక్సిన్ వేయించాలి.

గాలికుంటు వ్యాధి..

ఇది వైరస్ వల్ల కలిగే వ్యాధి. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల్లో కనిపిస్తుంది. వ్యాధి లక్షణాల విషయానికి వస్తే నోరు, గిట్టల్లో పుండ్లు పుట్టడం, ఎక్కువగా జ్వరం ఉంటుంది. ఈ వ్యాధి సోకిన చూడి పశువులు నాలుగైదు నెలల్లో ఈసుకుపోతాయి. నివారణకు బోరిక్‌రిన్ పేస్టును నోటిలో పుండ్లకు పూతగా పూయాలి. పీపీ ద్రావణంతో కాలిగిట్టల మధ్య కడగాలి. యాంటీబయాటిక్ మందులు, లివర్ టానిక్ ఉపయోగించాలి. ఏటా ఏప్రిల్, మే నెలల్లో వ్యాక్సిన్ వేయించుకోవాలి.

గుచ్చిమిలో లడ్డూ వేలం

- రూ.10 వేలు పలికిన పాట



గణనాథుని నైవేద్యం పెట్టిన లడ్డూను స్వీకరిస్తున్న మన్మథరావు

సీతానగరం: వినాయక నవరాత్రుల సందర్భంగా మండలంలోని గుచ్చిమిలో విఘ్నేశ్వరునికి సమర్పించిన లడ్డూను అదేగ్రామానికి చెందిన సచివాలయ కన్వీనర్ మన్మథరావు వేలం పాటలో రూ.10 వేలకు దక్కించుకున్నాడు. స్వామివారికి సమర్పించిన లడ్డూను ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం వేలం వేయగా 9 మంది భక్తులు పాటలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ గణనాథునికి నైవేద్యం పెట్టిన లడ్డూను వేలం పాటద్వారా దక్కించుకోవాలని కోరుకున్నానని ఈ మేరకు స్వామివారి లడ్డూను మహాప్రసాదంగా పొందగలిగానని తెలియజేశాడు.

పేదల సొంతింటి కల సాకారమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

సీతానగరం: అర్హులైన పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన సీతానగరం మండలంలోని సూరంపేటలో ప్రభుత్వం సమకూర్చిన ఇళ్ల లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సొంతిల్లు లేనివారికి ఇంటిస్థలం సమకూర్చడంతోపాటు గృహనిర్మాణ శాఖద్వారా పక్కా ఇల్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అలాగే టిడ్కో సంస్థ ద్వారా పక్కా ఇళ్లు మంజూరుచేసి నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్‌తో పాటు ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

అందరికీ దూరవిద్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: గ్రామాల్లో విద్యపట్ల ఆసక్తి కలిగిన బడి ఈడు, బడి బయట ఉన్న వారందరికీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దూరవిద్య విధానంపై సచివాలయ వెల్ఫేర్ సహాయకులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓలు జి.సూరిదేముడు, ఎంవీ రమణల అధ్యక్షతన సచివాలయ వెల్ఫేర్ సహాయకులతో దూర విద్య విధానం అమలుపై అవగాహన నిర్వహించారు. ఈ మేరకు ఎంపీడీఓ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందరికీ విద్య అందించాలనే సంకల్పంతో స్కూల్ స్థాయి నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ వరకూ దూరవిద్యను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అర్హులైన వారందరినీ దూరవిద్యలో నామమాత్రమైన ఫీజులు చెల్లించి ప్రవేశాలు గావించాలని కోరారు.

ఆర్వోబీ హైవే రోడ్డుపై పారిశుద్ధ్య పనులు

సీతానగరం:

మండల కేంద్రంలోని రాష్ట్ర రహదారిపై ఉన్న రైల్వే ఓవర్‌బ్రిడ్జికి ఇరువైపులా పెదభోగిలి మేజర్ పంచాయతీ సర్పంచ్ జె.తేరేజమ్మ పర్యవేక్షణలో ఈఓ జె.వెంకటరావు గురువారం కూలీలతో పారిశుద్ధ్య పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్వోబీ మీదుగా నిరంతరం వాహనాలతో పాటు అప్పయ్యపేట-సీతానగరం గ్రామాల మధ్య రోజూ వందలాదిమంది కాలినడక, ద్విచక్రవాహనాలతో తిరుగాడుతుంటారన్నారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగిస్తున్నట్లు చెప్పారు. అలాగే పెదభోగిలి పంచాయతీలోని నాలుగుగ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నామన్నారు. అన్ని వినాయక మంటపాల వద్ద ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. దోమల నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలియజేశారు.



హైవే రోడ్డులో ఆర్వోబీపై పిచ్చిమొక్కలను తీయిస్తున్న ఈఓ వెంకటరావు

నేడు మక్కువలో 'జగనన్నకు చెబుదాం'

మక్కువ: మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ నిశాంత్‌కుమార్‌తో పాటు జిల్లా స్థాయి అధికారుల బృందం పాల్గొంటుందన్నారు. మండలస్థాయి అధికారులంతా హాజరుకావాలని కోరారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

సాలూరు: బాల్య వివాహాలు చేయడం వల్ల ఎన్నో అనర్థాలు సంభవిస్తాయని బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. పట్టణంలోని నీరు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, బాల్యవివాహాల నిర్మూలనలో పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది ముఖ్య పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శ్రీనివాసరావు, సీడీపీఓ అనంతలక్ష్మి, నీడ్ సంస్థ ప్రతినిధి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురం: గిరిజనం సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంత నాయక్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గిరిజన నాయకులు గిరిజన ప్రాంతాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడికి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం..



శంబరలో మహిళల కోలాటం

మక్కువ: మండలంలోని శంబరలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. మహిళలు అద్భుతంగా కోలాటం ప్రదర్శించడంతో పలువురు అభినందించారు. అలాగే వాడవాడలా అన్నదానాలు నిర్వహించారు. మక్కువలోని గంట్యాడ వీధిలో నిర్వహించిన అన్నదానంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు హాజరై భక్తులకు ప్రసాదం వడ్డించారు.

వీఆర్వోలు ఈకేవైసీ చేయాలి



మాట్లాడుతున్న వ్యవసాయ సబ్‌డివిజన్ ఎ.డి టి.వెంకటేష్

సీతానగరం: మండలంలోని పొలాల్లో ఈక్రాప్ చేయించుకున్న రైతులంతా వీఆర్వోలతో ఈ కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ సంచాలకుడు టి.వెంకటేష్ కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్వీ రమణ అధ్యక్షతన ఈ కేవైసీ చేయడంపై వీఆర్వోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతుల సమక్షంలో ఈ కేవైసీ కార్యక్రమాన్ని గ్రామ రెవెన్యూ అధికారులు పూర్తి చేయాలని సూచించారు. తహసీల్దార్ ఎన్వీ రమణ మాట్లాడుతూ ఈకేవైసీ పనులు వీఆర్వోలు ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. ఏఓ ఎస్.అవినాష్ మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులు గ్రామాల్లో ఈ క్రాప్ నమోదు చేస్తున్నారని సెప్టెంబరు నెలాఖరుకు పూర్తి చేయాలని మార్గదర్శకాలు రావడంతో మరోసారి పొడిగింపు ఉండదని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల సహాయ గణాంక అధికారితో పాటు వీఆర్వోలు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

గురజాడకు ఘనంగా నివాళులు



గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



గురజాడ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న గంటేడ గౌరునాయుడు, విశ్రాంత ఉద్యోగులు

బలిజిపేట: మహాకవి గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా మండలంలోని పెదపెంకి గ్రామంలో గల నేతాజీ గ్రంథాలయం వద్ద గురువారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంజీవ నాయుడు మాట్లాడుతూ గురజాడ రచించిన కన్యాశుల్కానికి ఎంతో ఆదరణ లభించిందన్నారు. గురజాడ ఎంతో గొప్ప రచయిత అని కొనియాడారు. అటువంటి మహానుభావుడిని స్మరించుకోవడం ఎంతో గొప్ప విషయమన్నారు. దేశభక్తి గీతాలు రాసిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. కార్యక్రమంలో కె.గౌరీనాథ్, కె.రామకృష్ణ, కె.శ్రీరామ్, ఎం.వెంకటేష్, పి.సోములు తదితరులు పాల్గొన్నారు.

మానవతా మూర్తి గురజాడ

పార్వతీపురంటౌన్: మనిషిని ప్రేమించడం తన మతంగా చెప్పుకున్న మానవతా మూర్తి గురజాడ అప్పారావు అని కవి, రచయిత గంటేడ గౌరునాయుడు అన్నారు. గురువారం గురజాడ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు గురజాడ ప్రయత్నించారన్నారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహాకవి గురజాడ అప్పారావు అని కొనియాడారు. కార్యక్రమంలో సోమేశ్వరరావు, ఆళపు సర్వేశ్వరరావు, వేమకోటి నరహరిశాస్త్రి, పక్కి రవీంద్రనాథ్, కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

పార్వతీపురంటౌన్: పట్టణంలో రీ సర్వే వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూతింగ్ డాక్యుమెంటేషన్ తక్కువగా ఉందని, కరెక్షన్ వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. పట్టణంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన రహదారులు, కాలువల నిర్మాణానికి సంబంధించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. క్లాప్ యూజర్ల ఫీజు వసూలు పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌వైఎస్ఎస్ అధికారి పర్యటన




కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పార్వతీపురంటౌన్: మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో గల ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో ఆర్‌వైఎస్ఎస్ అధికారి రాధామోహన్ గురువారం పర్యటించారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల వద్ద రైతులతో మాట్లాడి వారు ఆచరిస్తున్న వ్యవసాయ పద్ధతులను, పంట దిగుబడుల గురించి ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల ఆరోగ్య పరిస్థితులు బాగుంటాయని, తక్కువ ఖర్చుతో పంట దిగుబడి బాగా ఉందని రైతులు అధికారులకు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణం పెంచాలని, దీనిలో వాడే కషాయాల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది రాజేష్, రీజనల్ ఆఫీసర్లు కె. ప్రకాశ్, హేమసుందర్, డీపీఎం షణ్ముఖరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణనాథుల నిమజ్జనం



పార్వతీపురంలో వినాయక నిమజ్జన ఊరేగింపు



సంగంవలసలో వినాయక నిమజ్జనోత్సవం

పార్వతీపురంటౌన్: తెలుగు వారి సంప్రదాయ తొలి పండగ అయిన వినాయక ఉత్సవాలు నాలుగు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక మంటపాలను ఏర్పాటు చేసి యువత, ఉత్సవ కమిటీలు వినాయక పూజలు నిర్వహించారు. గురువారం మండలంలోని సంగంవలస, ఎమ్మార్‌నగరం, చినబొండపల్లి తదితర గ్రామాల్లో స్వామివారి తిరువీధి, నిమజ్జనోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా యువత డీజే పాటలకు చిందులు వేస్తూ ఉల్లాసంగా స్వామివారిని గంగమ్మ ఒడికి చేర్చారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పార్వతీపురం / సాలూరు
9010204441, 9951602891
Office mail : vzmadvt@gmail.com